ఉద్యోగం పీకి వొదిలింది. యజమాని ముందు నన్నో వెధవని చేసి వొదిలింది. నా నైపుణ్యానికి మచ్చ తెచ్చింది" అని అక్కడ నుంచి వచ్చేశాను.

విభ్రాంతుడై చూశాడు శ్రీమంత్. "నువ్వు చెప్పింది నిజమేనా?"

"అనుమానమయితే ఆరా తీయండి మీరే. నేను వచ్చింది ఆ ప్రమాదానికి కారణం నేను కాని నా నిర్లక్ష్యం కాని, నా అసమర్థత కాని కావని చెప్పడానికే. మీకు నిజం తెలియజేయాలనే. వస్తా... నమస్తే..." అని వెనుదిరిగాడు అహమ్మద్.

నివ్వెరపాటు నుంచి తేరుకోలేకపోతున్న శ్రీమంత్ "ఎంత దారుణం! పేదరికం బాల్యానందాన్నే కాక బాలల బతుకుల్నీ దోచుకుంటూందా యీ దేశంలో! ఎంత అన్యాయం" అనుకుంటూ భారంగా నిట్టూర్చాడు.

# కుక్క

నేను మనుషుల డాక్టర్నవ్వాలని ఎంతగానో ఆశపడేవాడిని. కానీ విధి వెక్కిరించి చివరికి పశువుల డాక్టర్నవవలసి వచ్చింది.

ఆ వేళ "మిమ్మల్నున్నపళాన వెంటబెట్టుకొచ్చీమన్నారు మా అయ్యగారు, కారులో" అంటూ ఊళ్లో అత్యంత ధనవంతులలో ఒకరైన అప్పారావ్‌గారి కారు డ్రైవరు. నాకు ఆలోచించుకుందుకేనా సందివ్వకుండా యజమాని ఇంటికి తీసుకెళ్లాడు కారులోకి తోసేసి.

మొదటినుంచీ నాకు తెలివితేటలు తక్కువ. అప్పుడు విద్యపట్ల ఎలా శ్రద్ధ వుండేది కాదో, ఉద్యోగంలో చేరాక వృత్తి పట్ల కూడా అలాగే అశ్రద్ధ. పశువులకి నోరూ, ఫిర్యాదు చేయగలిగే శక్తీ లేవు కనుక నా ఉద్యోగ జీవితం బాగానే వెళ్లిపోతూంది. నా మంచి పశువులే నాకు శ్రీరామరక్షగా నిలిచాయి.

కారు అప్పారావ్‌గారి భవనం ముందాగింది. డ్రైవు నన్ను అప్పారావ్‌గారి గదిలోకి తీసుకెళ్లాడు. అంత పెద్ద విశాలమైన గదిని గది అనడం అవమానించడమే అవుతుంది. హాలు, దర్బార్ అలాటి గొప్ప పదాలు వాడాలి. దానిలో కుర్చీ... అహా సింహాసనంలో ఒకాయన.

ఆయనే కాని అప్పారావుగారైతే వీరి రూపానికి గాంభీర్యానికీ ఆ పేరు చాలా తక్కువైపోతుంది. కుర్చీలో వారు, వారి ఒడిలో ఓ కుక్క

నన్ను కూర్చోమని– "మీరేనా పశువైద్యులు?" అని అడిగారాయన.

చేతులు జోడిస్తూ ఔనన్నట్లు తలూపాను అచ్చం పశువులా.

"ఇది జూలియట్. జూలీ. గొప్పజాతి. అరుదైనది. ఇదంటే మాకెంతో ముద్దూ, ప్రాణమూ" అని కుక్కని పరిచయం చేస్తున్నట్లు వారలా అనేసరికి ఏం చేయాలో తోచక దానికి కూడా ఓ దణ్ణం పెట్టేసేవాడినే కాని సమయానికి దేముడడ్డం పడినట్లుంది.

"వెంటనే అబార్షన్ చేయాలి" అన్న మాటలు వినిపించి–

నివ్వెరపోతూ, అడిగాను "ఎవరికీ?"

"ఇంకెవరికీ? జూలీకే" కసిరినట్లే అనేసరికి నాకు కరచరణాలాడడం మానేశాయి. నేను పశువుల డాక్టరై పదేళ్లయింది కానీ నా సర్వీసులోఒక్క పశువుకి అబార్షన్ చెయ్యలేదు.

"స్కానింగ్‌లో జూలీకి పుట్టబోయేవన్నీ కూడా ఆడపిల్లలే అని తెలిసిందా?"

నాది చచ్చు ప్రశ్నలా తోచిందేమో, వారు నావేపొక చిరాకు చూపు చూశారు.

అయినా నేను ఎలాగో ధైర్యం చేసి "భారతీయులలా భారతీయ జంతువులకి అధిక జనాభా సమస్య ఏర్పడినట్లు లేదింకా. పైగా యన మనుషులకే తప్ప జంతువులకి ఆడసంతానమంటే అనసత్యం కాదు" అంటూంటే ఆయన సహనం పూర్తిగా చచ్చిపోయినట్లు ఒక నిట్టూర్పు విడచి–

"నీకు చెప్పడమే మంచిదేమో. ఈ రహస్యం నీ మనసుల్లోనే వుంచుకో. వారం కిందట నౌకర్లు ఏమరుపాటునుండగా జూలీ వీధిలోకి జారుకుని ఒక వీధికుక్కతో, ఊరకుక్కతో, అలగాజాతి కుక్కతో ముందూ వెనుకా, మంచీ చెడూ ఏమీ చూడకుండా కాలు జారేసింది"

"నేరం కుక్కది కాదు, కార్తెది" అన్నాను జూలీమీద జాలితో.

"మాది పరువు ప్రతిష్టలుకల కుటుంబం. జూలీది గొప్ప వంశం. రేపు జూలీ పిల్లల్నెవరెవరో గొప్పవారు పెంచుకుందుకడుగుతారు. అప్పుడా పిల్లల తండ్రి గురించి ఏం చెప్పగలం? నిజం చెబితే సిగ్గు సిగ్గు. అందుకే ఇప్పుడు జూలీకి అబార్షన్ చేసేస్తే ఈసారి జూలీని మంచి వంశమూ, జాతీ కల కుక్కతో మగ కుక్కతో కలిపి..."

వారి ఉద్దేశమూ, బాధా, తాపత్రయమూ అన్నీ అర్థమైపోయాయి నాకు.

నవ్వాలో ఏడవాలో తెలియక తల వంచేసుకున్నాను.

✡ ✡ ✡ ✡ ✡

# ఇది ఒక శ్వేత వ్యథ

నేను చదువుతున్నది కో–ఎడ్ కాలేజీలో. మా క్లాసులో ఇరవైమందమ్మాయిలూ అరవైమందబ్బాయిలూ ఉన్నారు. నాకు తప్ప మిగిలిన అందరమ్మాయిలకీ కొన్నో ఎక్కువో ప్రేమలేఖలు వొచ్చాయి. వారి వెంట అబ్బాయిలు పడతారు. ప్రేమిస్తున్నామంటూ కవిత్వమూ, సినిమా పాటలూ పాడతారు. కవ్విస్తారు. నవ్విస్తారు. నానా చేష్టలూ చేస్తారు. కానీ – నాకొక్కటంటే ఒక్కటయినా ప్రేమలేఖ రాలేదు. ఒక్క అబ్బాయీ నా వెంట పడలేదు. ఒక్కరయినా నన్ను ఐలవ్‌యూ అనలేదు. కవ్వించలేదు. అందుకే నాకేడు పొస్తూంది.

ఎవరూ నా కళ్ళల్లో కళ్ళు కలపరు. నన్ను తేరిపార చూడరు. ఒక్కసారి– ఒక్కక్షణం నా ముఖమూ కళ్లూ చూసిన తక్షణం కళ్లు దించేసుకుంటారు. తల వొంచేసుకుంటారు. నిశ్శబ్దంగానూ